క్లుప్తంగా

బదిలీపై వెళ్తున్న పశువైద్యాధికారికి సన్మానం



గోరెంట్లలో పశువైద్యాధికారి ఆసిఫాను సన్మానిస్తున్న సిబ్బంది

మద్దిరాల : కష్టపడి పనిచేసిన వారికి సమాజంలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని ఇన్‌చార్జ్ మండల వైద్యాధికారి ప్రమీల అన్నారు. మండల పశువైద్యాధికారి ఆసిఫా బదిలీపై వరంగల్ వెళ్తుండడంతో సోమవారం మండల పరిధిలోని గోరెంట్ల పశువైద్యశాలలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్రలు నాగెల్లి శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, రమేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్‌కు మోటార్లు పెట్టొద్దు

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీలో ఇళ్లలోని నల్లా కనెక్షన్‌లకు నేరుగా మోటార్లు పెట్టొద్దని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని 30వ, 43వ వార్డులలో మున్సిపల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నల్లా కనెక్షన్‌లకు నేరుగా మోటార్లు పెట్టి నీటిని వాడుకుంటున్న గృహాల్లో మోటార్లను తొలగించి కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పలువురు గృహాల యజమానులు తమకు నీళ్లు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు చేయడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరోసారి మోటార్లు బిగిస్తే నల్లా కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వరుణ్, సిబ్బంది సయ్యద్ సమ్మి, వేణు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

3న ఆరోగ్య అవగాహన శిబిరం

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆగస్టు 3న వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఆరోగ్య అవగాహన శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య కోరారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. మహిళలు గర్భకోశ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజయవాడకు చెందిన డాక్టర్ మాధవి రవీంద్ర బృందం అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

30న చలో హైదరాబాద్

పెన్‌పహాడ్ : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు రణపంగ వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 నిర్వహించే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

గోదావరి నీళ్లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కడియం కుమార్

తిరుమలగిరి : ఎస్సారెస్పీ కాల్వ ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన నాగారం మండల కేంద్రంలో మాట్లాడారు. రైతులు నార్లు పోసుకొని నెల రోజులు దాటినా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షాలు కూడా సరిగా కురియక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భిక్షం, వెంకటయ్య, అంజయ్య, రాములు, మల్లయ్య, మారయ్య, స్వరూప, ధర్మ పాల్గొన్నారు.

వీరయ్య మృతి బాధాకరం

మునగాల : మండలంలోని రేపాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్ తండ్రి బత్తుల వీరయ్య మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు పచ్చిపాల వేణుయాదవ్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన బత్తుల వీరయ్య కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, రేపాల దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ పందిరి పుల్లారెడ్డి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్, శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు రాయి రవి, అలీబాబు, లింగయ్య గౌడ్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న వేణుయాదవ్

మలుపులు.. మృత్యు పిలుపులు

- ప్రమాదకరంగా పలు గ్రామాల రహదారులు
- మూలమలుపులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కనిపించని సూచిక బోర్డులు



దురాజ్‌పల్లి - ఖాసీంపేట రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



పాండ్యానాయక్ తండా - చివ్వెంల రహదారిలో..

చివ్వెంల : మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు మూలమలుపులతో ప్రమాదకరంగా ఉన్నాయి. కనీసం సూచిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చివ్వెంల మండలంలోని వాల్యతండా-వట్టిఖమ్మంపహాడ్ మధ్య, మున్యానాయక్‌తండా-బీబీగూడెం గ్రామాల మధ్య, తిమ్మాపురం-బి.చందుపట్ల గ్రామాల మధ్య, మోదిన్‌పురం-ఖాసీంపేట గ్రామాల మధ్య, లక్ష్మణ్ నాయక్‌తండా-పులితండా మధ్య, బి.చందుపట్ల-భీమ్లాతండా మధ్య, మొగ్గయ్యగూడెం-చందుపట్ల మధ్య, పిల్లలజెగ్గుతండా-జయరాం గుడితండా మధ్య, పాశ్యాతండా-పాలిమేర సూర్యాతండా మధ్య, చివ్వెంల-పాండ్యానాయక్ తండా మధ్య, దురాజ్‌పల్లి- ఖాసీంపేట మధ్య రహదారులపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

మలుపులకు తోడు ముళ్లకంప..

ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులకు తోడు రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలతో రోడ్డు కనిపించడం లేదు. గ్రామాలకు సింగిల్ రోడ్డు కావడం పైగా మూలమలుపులు, కంపచెట్లు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూలమలుపుల వద్ద పంచాయితీ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అవేమీ కనిపించడంలేదు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి రహదారులపై ప్రమాదకర ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, మూలమలుపులు సరిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మూలమలుపులు సరిచేయాలి

చివ్వెంల మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే దారుల్లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు సరిచేయాలి. మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– బానోతు లింగా నాయక్, జయరాం గుడితండా

ప్రమాదాలను నివారించాలి

గ్రామాల రహదారుల్లో మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మూలమలుపులను సరిచేయించాలి. అంతేకాకుండా రహదారుల వెంబడి ఉన్న కంపచెట్లను తొలగించాలి.

– బానోతు మంగులాల్, మున్యానాయక్ తండా

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : ఆగస్టు 9న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిడి కృష్ణ అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పి పది సంవత్సరాలుగా బీజేపీ మొండి చేయి చూపుతుందన్నారు. మాదిగలకు ఉచిత హామీలు ఇస్తూ ఓట్లు దండుకుంటుందని తెలిపారు. అనంతరం చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత సైదులు, సురేష్, లింగయ్య, వెంకన్న, నాగార్జున, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 2ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న పాక లింగమల్లు యాదవ్

తిరుమలగిరి : జీఓ నెం.2ను రద్దు చేయాలని ధర్మ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్ కోరారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 317 జీఓపై వేసిన క్యాబినెట్ కమిటీ నిర్ణయాలను అనుసరిస్తూ టీచర్స్ ద్వారా స్వీకరించిన ప్రతి అప్పీల్‌ను పరిష్కరించాలని కోరారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో 20 నుంచి 25 శాతం నిధులు కేటాయించాలని అన్నారు. సుదీర్ఘ కాలంగా ఉన్న కామన్ సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, రాజు, రమేష్, జనార్దన్, సాంబయ్య, శంకర్, బాబు, సుధాకర్, నాగయ్య, శ్రీనివాస్, సురేష్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డులో నాట్లేసి నిరసన



చౌళ్లతండా రోడ్డులో నాటు వేసి నిరసన తెలుపుతున్న తండావాసులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని చౌళ్లతండాకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ తండావాసులు సోమవారం బురద దారిలో వరి నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడారు. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డంతా బురదతో చిత్తడిగా మారుతుందని అన్నారు. దీంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తుంగతుర్తి మండల కేంద్రానికి వెళ్లాలంటే వాహనాలు సైతం బురదలో కూరుకుపోతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించి గిరిజన తండాకు సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని తండావాసులు కోరుతున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు రాయితీ

- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



అనంతారం శివారులో నాటిన మామిడి మొక్కలు

పెన్‌పహాడ్ : ప్రజల అవసరాలకు అనుకూలంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి లేకపోవడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరోవైపు దిగుబడులు తగ్గడంతో మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించేందుకు రాయితీలు అందిస్తోంది. ప్రతి మొక్కకు నీటిని అందించేందుకు సబ్సిడీపై సూక్ష్మ సేద్యపు పరికరాలు ఇవ్వనుంది. పెన్‌పహాడ్ మండలంలో పండ్ల తోటలకు అనువైన నేల ఉంది. ఇప్పటికే మండలంలోని దూపహాడ్, అనంతారం, లింగాల, అన్నారం గ్రామాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారు.

ఉద్యాన పంటలకు..

ఉపాధి హామీ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 14 రకాల పండ్ల తోటలు సాగు చేసేందుకు అవకాశం ఉంది. డ్రాగన్ ఫ్రూట్, జామ, నిమ్మ, నేరేడు, నారింజ, జీడి మామిడి, సీతాఫలం, సపోటా, ఆయిల్ పాం, ఆపిల్ బేర్, దానిమ్మ, కొబ్బరి తదితర పంటలతోపాటు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలను సాగు చేసుకోవాలి. అంతర్ పంటలుగా ఆకుకూరలు, బీర, సొర, కాకర, చిక్కుడు, టమాట, దోస, మునగ, పూలు సాగు చేయవచ్చు.

అర్హులైన రైతులకు..

పండ్ల తోటల రాయితీ పొందేందుకు రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండి, అనువైన భూమి, నీటి సౌకర్యం కలిగి ఉండాలి. 5ఎకరాల లోపు భూమి ఉండి షెడ్యూల్ కులాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, మిగిలిన రైతులకు 90శాతం రాయితీపై పరికరాలు అందజేయనున్నారు. రైతులకు రాయితీపై మొక్కలు, బిందు సేద్యం పరికరాలు అందిస్తారు. మొక్కలు నాటిన ఏడాది నుంచి 3, 4 ఏళ్ల వరకు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే మంజూరు చేస్తుంది.

దరఖాస్తులు స్వీకరించి..

నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టేందుకు ఉద్యానవన శాఖ అధికారులు ప్రణాళిక తయారు చేస్తున్నారు. అన్నదాతలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారుల నుంచి లబ్ధిదారులను గుర్తించి ఆగస్టు 15లోపు ప్రతిపాదన రూపొందిస్తారు. వచ్చే నెల వరకు మొక్కలు నాటడం, బిందు సేద్యం పరికరాలు బిగించడం పూర్తి చేయాల్సి ఉంటుంది.

మొక్కలు నాటేందుకు అనువైన సమయం



పండ్ల తోటల పెంపకానికి ఇది అనుకూల సమయం. రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా మూడేళ్లపాటు యాజమాన్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. అర్హత ఉన్న రైతులు దరఖాస్తులను ఏపీఓ, ఉపాధి హామీ కార్యాలయంలో అందజేయాలి. రాయితీని నగదు రూపంలో రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

– రవి, ఏపీఓ

మొక్కలే మానవాళికి జీవనాధారం



అడివెంలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏపీఓ ఉపేందర్

అర్వపల్లి : మొక్కలే మానవాళికి జీవనాధారమని ఉపాధిహామీ పథకం ఏపీఓ చిలుక ఉపేందర్ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామంలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈ విడత వనమహోత్సవంలో మండల వ్యాప్తంగా 1,01,000 మొక్కలు నాటాల్సి ఉండగా ఇప్పటివరకు 87వేల మొక్కలను నాటినట్లు చెప్పారు. వర్షాలు పూర్తిస్థాయిలో పడగానే వనమహోత్సవం కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ గంగ, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

రూ.25 వేల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపట్టబోయే కల్యాణ మండపం నిర్మాణానికి దాతలు విరాళం అందించారు. హుజూర్‌నగర్‌కు చెందిన తుడపనూరి శేఖర్ విజయలక్ష్మి దంపతులు సోమవారం నడిగూడెంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిరిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండా వెంకన్న, వందనపు దయాకర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



అర్వపల్లి : అనసూర్యమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చివ్వెంల : బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మృతుడి స్నేహితులు

అర్వపల్లి : కోడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చెంచల శ్రీనివాస్ తల్లి అనసూర్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సోమవారం మృతురాలి చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అలాగే కొమ్మాలలో ఇటీవల గడ్డం యల్లమ్మ మృతిచెందగా మృతురాలి కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, సామ రవీందర్ రెడ్డి, పెసర సతీష్‌రెడ్డి, కుంటిగొర్ల శ్రీను, కదం శ్రీను, అమీనుద్దీన్, లింగయ్య, ఉపేందర్, ఖాజ, సందీప్, యాదగిరి, అనిల్, బద్రి, రవి ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన కలకొండ వినయ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి అతడి 10వ తరగతి బ్యాచ్ స్నేహితులు సోమవారం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రావిచెట్టు లక్ష్మణ్, ధరావతు విజయ్, గోగుల వెంకటమ్మ, కలకొండ రాంబాబు, బల్గూరి ఉపేందర్, పోకల మధు, చీమ అఖిల్, యల్కపల్లి మహేష్, గన్నోజు సంతోష్, దండ నాగలింగం, చీమ అనూష, రౌతు శ్రీనివాస్, సునావత్ రమేష్, ధరావతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి 31న చలో అసెంబ్లీ



ఆత్మకూర్ (ఎస్) : మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి కేవలం 7.3 శాతం నిధులను కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. ఉద్యోగ క్యాలెండర్ విషయంపై మాట్లాడే పరిస్థితి కూడా లేదని, వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులను అప్రమత్తం చేసి సరైన వైద్యం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు అనంతల సందీప్, మహేష్, వరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : నిరుద్యోగ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 31న నిర్వహించే అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు మున్నా అశోక్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విద్యారంగానికి కేవలం 7.3శాతం నిధులు కేటాయించడం దారుణమన్నారు. విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయిస్తేనే విద్యాభివృద్ధి మెరుగవుతుందని తెలిపారు. అసెంబ్లీ ముట్టడికి నిరుద్యోగులు, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

31న ఇందిరా పార్క్ వద్ద ధర్నా

సూర్యాపేట : కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేసి, కాంట్రాక్ట్ కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 31న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ ఎం. రాంబాబు ఉద్యోగులకు, కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సూర్యాపేట పట్టణంలో మాట్లాడారు. కాంట్రాక్టు విభాగంలో పనిచేస్తున్న వారందరికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇన్సూరెన్స్ కల్పించాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీఓ సందీప్‌కుమార్



మురుగు నీటి గుంతలో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సందీప్‌కుమార్ కోరారు. అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో గ్రామ పంచాయతీ సిబ్బందితో సోమవారం పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేయించారు. అలాగే ఆవరణ మొత్తం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వీధులు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాగా నాగయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : గ్రామాల్లోని వీధుల్లో మురుగు నీరు నిలువకుండా చూసుకోవాలని మండల సామాజిక ఆరోగ్య అధికారి ఎల్.చరణ్ కోరారు. మండల పరిధిలోని కొమ్మాల, కోమటిపల్లి తదితర గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. ఆయిల్ బాల్స్‌తో దోమలను నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, వైద్యసిబ్బంది, గ్రామపంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కోదాడ రూరల్ : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వచ్చే నెల 6న తలపెట్టిన దీక్ష కరపత్రాన్ని సోమవారం కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చి మాదిగలను మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో పోరాడాలన్నారు. కార్యక్రమంలో పోలంపల్లి శ్రీను, గంధం రంగయ్య, కాంపాటి శ్రీను, చీమ శ్రీను, సిద్దెల రాంబాబు, రామారావు, లాజర్, రాజు, నరేష్, శాంతయ్య, రఘు తదితరులు ఉన్నారు.

సీపీఎం నాయకుడు మృతి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, నీటి సంఘం మాజీ చైర్మన్ గుండ్లపల్లి నాగేశ్వరరావు (62) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, ఆయన మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండి.జలీల్, నాయకులు ఎస్‌కే.సైదా, బెల్లంకొండ సత్యనారాయణ, సీతారాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లతీఫ్‌బాబు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునగాల : మునగాల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ నాయకుడు పచ్చిపాల వేణుయాదవ్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, ఉప్పల మల్లేష్ పాల్గొన్నారు.

బకాయి బిల్లులను విడుదల చేయాలి

అర్వపల్లి : గ్రామ పంచాయతీలకు కొంత కాలంగా రావాల్సిన బకాయి బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గత సర్పంచ్‌లు కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయినప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామాల్లో నిధుల కొరతతో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరారు. సర్పంచ్‌లు లేక గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కల సురేందర్, శతకోటి వెంకన్న, నర్సింహ, సరస్వతి, పద్మ, వీరన్న, సైదులు పాల్గొన్నారు.

పాస్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని యేసుక్రీస్తు ఆశీర్వాద ప్రార్థన మందిరంలో సోమవారం మండల స్థాయి పాస్టర్ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసాని యేసురత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా బాలసుబ్రహ్మణ్యం, జయరాజ్, జనరల్ సెక్రటరీగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జ్ఞానరత్నం, కార్యవర్గ సభ్యులుగా జాన్‌మార్క్, జాబేజు, జాన్‌వెస్లి, సుధాకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కోదాడకు చెందిన సీనియర్ నాయకులు లూకాకుమార్, జి.ఆర్.అబ్రహం, ప్రభుదాస్, శ్రీనివాస్‌గౌడ్, నెహెమ్యా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

4న లాండ్రీ షాప్ యూనియన్ సభ్యుల సమావేశం



కరపత్రం ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో వచ్చే నెల 4వ తేదీన పట్టణ లాండ్రీ షాప్ యూనియన్ సభ్యుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వడ్లానపు శ్రీను తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ రజక యూనియన్ ఆధ్వర్యంలో సమావేశ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు ఉపేందర్, నరసయ్య, వి.నరసింహారావు, రాంబాబు, నరసింహారావు, పిచ్చయ్య, మధు, అంజి, శివ, ఐ.శ్రీను, ఏ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.